
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
3 జిల్లా వార్తలు
ఆదివారం 8 డిసెంబరు 2024





కొందుర్గులో ధాన్యం కుప్పలపై కప్పిన ప్లాస్టిక్ కవర్లు

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

చౌదరిగూడ/ఆమనగల్లు/యాచారం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): రైతులకు వాన గుబులు పట్టుకుంది. శనివారం అకస్మాత్తుగా కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యింది. కొందుర్గు మండల కేంద్రంతోపాటు ఉత్తరాస్‌పల్లి, ముట్పూర్, టేకులపల్లి, మహాదేవ్‌పూర్, లాలపేట్ జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి, లచ్చంపేట్ గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడవకుండా ప్లాస్టిక్ కవర్లు తీసుకొచ్చి కప్పారు. అలాగే ఆమనగల్లు పట్టణంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో వ్యవసాయ మార్కెట్ యార్డులో విక్రయానికి తెచ్చిన ధాన్యం తడిసిపోయింది. వరదలో కొంత ధాన్యం కొట్టుకుపోయింది. రెండు మూడు రోజులుగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకాలు వేయడం లేదు. దీంతో మార్కెట్లో వడ్ల నిల్వలు పేరుకుపోయాయి. అదేవిధంగా యాచారం మండలంలోని యాచారం, నజ్దిక్‌సింగారం, తాటిపర్తి, మేడిపల్లి, మాల్, కొత్తపల్లి తదితర గ్రామాలలో శనివారం రాత్రి కురిసిన మోస్తరు వర్షానికి రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడసిపోయింది. అలాగే యాచారంలోని కొనుగోలు కేంద్రంలో కుప్పలను వర్షం నీరు చుట్టుముట్టింది.

సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె నోటీసు



ఇన్‌చార్జి ఎంఈవోకు సమ్మె నోటీసు ఇస్తున్న ఉద్యోగులు

కేశంపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా అభియాన్ రాష్ట్ర న్యాయకత్వం సూచనతో మండల స్వరశిక్షా అభియాన్ ఉద్యోగులు శనివారం తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలకు సమ్మె నోటీస్ ఇచ్చారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు విద్యాశాఖలో విలీ నం చేయడం, పూర్తి పేస్కేల్ తదితర డిమాండ్లతో తహసీల్దార్ మీర్ ఆ జంఅలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఇన్‌చార్జీ ఎంఈవో చంద్రశేఖర్‌లకు నోటీసిచ్చారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు రామకృష్ణ, మల్లయ్య, మ ల్లేష్, కేజీబీవీ టీచర్లు నక్షత్ర, వరలక్ష్మి, జ్యోతి, సువర్ణ, కవిత పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై దుకాణాల తొలగింపు



జేసీబీతో రోడ్డు పక్కన కట్టడాలను తొలగింపజేస్తున్న హెచ్‌ఎండీఏ సిబ్బంది

శంషాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి పక్కన ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను హెచ్‌ఎండీఏ సిబ్బంది శనివారం సాయంత్రం కూల్చివేశారు. శంషాబాద్ నుంచి కిషన్‌గూడ-ఎయిర్‌పోర్టు రోడ్డు, ట్రంపెట్ పక్కన రోడ్డుకు రెండు పక్కల గల ఫుట్‌పాత్‌లను కొందరు కొన్ని రోజులుగా ఆక్రమించుకొని దర్జాగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఈ విషయం తెలిసిన హెచ్‌ఎండీఏ సిబ్బంది ఆ ప్రాంతానికి జేసీబీని తీసుకెళ్లి కూల్చివేయించారు. కొందరు అడ్డుకోవడానికి యత్నించగా పోలీసులు నివారించారు. ఒక దశలో సిబ్బందితో దుకాణదారులు వాగ్వాదానికి దిగారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో కూల్చివేతలు కొనసాగాయి. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. తొలగించిన వాటి స్థానంలో తిరిగి దుకాణాలు కానీ, డబ్బాలు కానీ ఏర్పాటుచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



లక్నాపూర్ ప్రాజెక్టు

Sunday Special

ఆహ్లాద క్షేత్రాలు.. ఆదరణకు దూరం!

పాంబండ ఆలయం, లక్నాపూర్ ప్రాజెక్టు, దామగుండం ఆలయానికి సందర్శకుల తాకిడి

ప్రకృతి సౌందర్యంతో గ్రామ సీమల మధ్య కనువిందు కలిగించే ప్రదేశాలు ఉన్నా.. అవి ఆదరణకు నోచుకోవడం లేదు. సువిశాల క్షేత్రాలు... కళకళలాడే సెలయేరులు.. పక్షుల కిలకిలా రావాలు.. పచ్చని చెట్లు... ఆహ్లాదాన్ని కలిగించే వాతావరణం ఉన్నా.. అక్కడ కనీస వసతులు లేక పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిగి నియోజకవర్గంలోని పూడూర్ మండలం దామగుండం ఆలయం, కులకచర్ల మండలం పాంబండ దేవాలయం, పరిగి మండలం లక్నాపూర్ ప్రాజెక్టు ప్రాంతాలను పర్యాటకులు నిత్యం సందర్శిస్తుంటారు. అయితే వాటిని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయడంలో పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

- కనీస వసతులు లేక పర్యాటకుల తిప్పలు
- పర్యాటక ప్రాంతాలుగా మార్చాలంటూ డిమాండ్

పరిగి, డిసెంబరు 7: దక్షిణ భారత దేశంలో ప్రసిద్ధిగాంచిన పాంబండ శ్రీరామలింగేశ్వర దేవాలయం కూడా పర్యాటకులను ఆకర్షిస్తుంది. కులకచర్ల మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో కిలోమీటరు పొడవు ఎత్తైనా ఒకే ఒక రాయి గుండును కలిగి ఉంది. ఇలాంటి ఏకశిల గురించి దక్షిణ భారత దేశంలోనే గొప్పగా చెపుకుంటారు. కొండపై చుట్టూ రాతితో మధ్యలో ఉన్న ఈ కోనేరును చూస్తే ఎవరికైనా ఆశ్చర్యకరంగానే ఉంటుంది. ప్రస్తుతం ఉన్న పర్వతానికి ఎదురుగా మరో పర్వతం ఉంది. పూర్వకాలంలో ఈ రెండు కొండలు కలిసి ఉండేవని, అయితే అపరిశుభ్రంగా ఉన్న ఓ వ్యక్తి ఈ కొండపైకి రావడం మూలంగా ఒక సర్పం కొండ మధ్య భాగంలో నుంచి వెళ్లిందని చరిత్ర చెబుతోంది. ఈ కారణంగానే ఈ కొండ రెండు భాగాలుగా చీలిపోయిందని

మిగతా 5వ పేజీలో...

నిరుపయోగంగా క్యాంప్ కార్యాలయం

- ఎనిమిదేళ్లుగా ఖాళీగా భవనం
- కోటి రూపాయలతో నిర్మాణం
- అటువైపుగా వెళ్లని ప్రజాప్రతినిధులు
- వినియోగంలోకి తేవాలంటున్న జనం



6

వరికొయ్యలకు నిప్పు..

- భూసారానికి ముప్పు
- నేలలోని పోషకాలు నాశనం
- తగ్గనున్న పంట దిగుబడి
- వాయు కాలుష్యంతో ఇబ్బంది



4

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- ఆటలతో స్నేహభావం పెంపు
- సీఎం కప్ క్రీడా పోటీలను
- ప్రారంభించిన అధికారులు
- ఉత్సాహంగా పాల్గొన్న స్టూడెంట్స్



6

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

- చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య



చేవెళ్ల : భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

చేవెళ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, రాబోవు తరాలకు మంచి నైపుణ్యం, విద్యనందించేందుకు ఎంతో ఉపయోగపడుతాయని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలో రూ.1.80 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవనం నిర్మాణానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుకున్న యువతీయువకులు, నిరుద్యోగులకు పోటీ ప్రపంచంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. తహసీల్దార్ కృష్ణయ్య, చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్‌చైర్మన్ రాములు, మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు బండారు ఆగిరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పాండుయాదవ్, యూత్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, డైరెక్టర్లు నరేందర్, జనార్దన్, సత్యనారాయణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : మన గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎమ్మెల్యే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం షాబాద్‌లో రూ.80లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని వారు ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల సహకారంతో రంగారెడ్డి జిల్లాలో శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయాల స్థానంలో నూతన భవనాలను ఏర్పాటు చేస్తామన్నారు. పీసీసీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, చేవెళ్ల ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీలు రవీందర్, చెన్నయ్య, అశోక్, మల్లేష్, మాజీ సర్పంచులు ప్రతాప్‌రెడ్డి, ఖాజామియా, జంగయ్య, నర్సింహులు, ఆంజనేయులు, నాయకులు చేవెళ్ల స్వామి, అక్తర్‌పాషా, అన్వర్, రాహుల్, గౌరీశ్వర్, కుద్దూస్, సత్యం, గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి మనోజ్‌కుమార్, అధికారులు ప్రతాప్, శ్వేత తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాగర్‌కుంట గ్రామంలో బస్సు షెల్టర్‌ను వారు ప్రారంభించారు. బొబ్బిలిగామ, లక్ష్మారావుగూడలో అయ్యప్ప పడిపూజలో పాల్గొన్నారు.

గుట్టుగా గంజాయి దందా

- ఇతర రాష్ట్రాల నుంచి రవాణా
- పోలీసుల పటిష్ట నిఘా
- అయినా ఆగని విక్రయాలు

యాచారం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం డివిజన్‌లో మత్తు పదార్థాల దందా యథేచ్ఛగా జరుగుతోంది. పోలీసు అధికారులు పటిష్ట నిఘా ఏర్పాటు చేసినా గంజాయి రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు. గ్రామీణ ప్రాంతాల యువత మత్తుకు అలవాటు పడటంతో స్థానికంగా ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ఒడిశా, బీహార్, జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎక్కువగా గంజాయి ఇక్కడికి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గంజాయి విక్రయాలపై మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు పర్యవేక్షణలో యాచారం, హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ, ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, మంచాల పోలీస్ స్టేషన్ల సిబ్బంది నిరంతరం సోదాలు చేపడుతున్నారు. రాత్రి వేళల్లో వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. అయినా కొందరు అక్రమార్కులు తమ తెలివి తేటలు ఉపయోగించి గంజాయిని వివిధ రూపాలలో, అనేక దారులలో గుట్టు చప్పుడు కాకుండా తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.



యాచారం పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి (ఫైల్)

ఇటీవల పట్టుబడిన గంజాయి వివరాలు

- ఆంధ్రాకు చెందిన కొందరు కారులో తరలిస్తున్న 60కిలోల 420 గ్రాముల గంజాయిని మాల్ చెక్‌పోస్ట్ వద్ద యాచారం, మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు.
- మహారాష్ట్రకు చెందిన కొందరు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న 60 కిలోల గంజాయిని ఇబ్రహీంపట్నం పోలీసులు తాళ్లపల్లి గూడ గేటు వద్ద పట్టుకున్నారు.
- ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంగరకలాన్ పరిసర ప్రాంతంలో తుక్కుగూడ వెళ్లేదారిలో తిరుగుతున్న ముంబయికి చెందిన

మిగతా 6వ పేజీలో...

విస్తృతంగా సోదాలు...

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై పోలీసింగ్ విజబుల్ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గంజాయి క్రయ విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. నిరంతరం సోదాలు నిర్వహిస్తున్నాం.

కేపీవీ రాజు, ఇబ్రహీంపట్నం ఏసీపీ



బాలమల్లేష్ మరణం విప్లవోద్యమాలకు తీరని లోటు

- సంస్మరణ సభలో ప్రొఫెసర్ హరగోపాల్



సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

శంషాబాద్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, బీకేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలమల్లేష్ మృతి విప్లవ పోరాటాలకు తీరని లోటు అని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. బాలమల్లేష్ సంతాప సభను శనివారం శంషాబాద్ ఎలైట్ హోటల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై హరగోపాల్ మాట్లాడారు. పేదల కోసం నిత్యం పోరాడుతూ ప్రజా జీవితమే తన జీవితంగా భావించి అసువులు బాసిన నాయకుల జీవితాలు త్యాగాలతో కూడుకున్నవన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. ఒక్క రోజైనా కమ్యూనిస్టుగా జీవిస్తే ఆ విలువే వేరని అన్నారు. కమ్యూనిస్టుల ప్రతి అడుగూ ప్రజల కోసమే అన్నారు. కార్యక్రమంలో బీకేఎంయూ జాతీయ ప్రధాన కార్యదర్శి నిర్మళ్‌పాండే, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి, డీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య ప్రసంగించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాములు, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సాయిలుగౌడ్, సీపీఐ కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్‌రావు, పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు పి.పర్వతాలు, కావలి నరసింహ, ముత్యాలు, యాదిరెడ్డి, కె.రామస్వామి, బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య, రాష్ట్ర కార్యదర్శి సృజన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కె.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మానాన్నలే అసలైన హీరోలు

ప్రముఖ అంతర్జాతీయ మోటివేటర్ గంపా నాగేశ్వర్‌రావు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న గంపా నాగేశ్వర్‌రావు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జన్మనిచ్చిన పిల్లలకు జీవితాన్ని ఇచ్చేందుకు జీవితాలను త్యాగం చేసే తల్లిదండ్రులే అసలైన హీరోలని ప్రముఖ అంతర్జాతీయ మోటివేటర్ గంపా నాగేశ్వర్‌రావు అన్నారు. ప్రజాపరిపాలన విజయోత్సవ కార్యక్రమాన్ని శనివారం బుగ్గారెడ్డి గార్డెన్‌లో నిర్వహించారు. మున్సిపాలిటీ చైర్మన్ కొందూటి నరేందర్ అధ్యక్షతన జరిగిన సభకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, షాద్‌నగర్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ డబ్బు కోసం సినిమాల్లో నటించే కళాకారులు హీరోలు కారని, మన తల్లిదండ్రులే నిజమైన హీరోలన్నారు. అలాగే అహర్నిశలు శ్రమిస్తూ ప్రజల ఆరోగ్యం కోసం పట్టెడన్నం పెడుతున్న రైతులు, ప్రాణాలను లెక్క చేయక దేశ రక్షణ కోసం పహారా కాస్తున్న సైనికులు, అంతర్గత భద్రత కోసం పనిచేస్తున్న పోలీసులు, విద్యాబుద్ధులు నేర్పే గురువులు, ప్రజారోగ్యం కోసం చీపురుపడుతున్న పారిశుధ్య కార్మికులు హీరోలని అన్నారు. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడమే కాదు, విద్యార్థులను ఆటలాడిస్తూ క్రీడానైపుణ్యాన్ని పెంచాలని నాగేశ్వర్‌రావు సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఎంఈవో మనోహర్, కౌన్సిలర్లు శ్రావణి, మహేశ్వరి, సర్వర్‌పాషా, మాధురి, శారద తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వికారాబాద్‌లో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

వికారాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు ఆటో ర్యాలీ నిర్వహించారు. శనివారం వికారాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. మహిపాల్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.50వేలు ఇవ్వాలన్నారు. అంతేకాకుండా ఆటో రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేసి, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, రూ.10లక్షల ప్రమాదబీమా కూడా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు యాదయ్య, జంగయ్య, ప్రశాంత్, నర్సింహులు, వెంకట్, రఫీహలీం, మహేందర్, అంజయ్య, రవి, మహేష్, పాండు, మల్లేశం, దర్శన్, రాజీవ్, ఖాదర్, శ్రీనివాస్, ప్రశాంత్, ముజఫర్, సుభాష్, శ్రీకాంత్, ఖలీం, రాజు, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఎదులాబాద్‌లో వరికొయ్యలను కాల్చిన రైతులు

వరికొయ్యలకు నిప్పు.. భూసారానికి ముప్పు

- నేలలో ఉండే పోషక పదార్థాలు నాశనం
- వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తే ఎంతో మేలు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వరికోతలు చేపట్టిన తరువాత కొయ్యకాళ్లను కాల్చడం వల్ల తీవ్ర ఇబ్బందులు తప్పవని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వరికొయ్యకాళ్లను కాల్చడం వల్ల వాయుకాలుష్యం ఏర్పడి పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. అంతేకాకుండా నేలలోని పోషక పదార్థాలు నాశనమవుతాయి. దాంతో ఆశించిన మేర పంట దిగుబడి రాదు. భూమిలో ఉండే నత్రజని, భాస్వరం, పొటాషియం, సేంద్రియ పదార్థాలతో పాటు పంటలకు ఉపయోగపడే వానపాములు, ఇతర మిత్రపురుగులు మృత్యువాత పడి రైతులకు నష్టాన్ని మిగులుస్తాయి. భూమిలోని పోషకాలు పెద్దమొత్తంలో కాలి బూడిదై పంటలకు తీరని నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. కొయ్యకాళ్లను కాల్చడం వల్ల వెలువడే పొగతో ప్రజలకు ఊపిరితిత్తుల సమస్యతో పాటు అనేక ఇతరత్రా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వాతావరణ సమతుల్యం కూడా దెబ్బతింటుంది. కొయ్యకాళ్లను పొలంలో కలిపి దున్నడం వల్ల సేంద్రియ పదార్థంగా మారి భూమికి సారం పెరుగుతుంది. భూమిలో తేమశాతం నిలుపుదలకు, భౌతిక పరిస్థితిని మెరుగుపడుటకు సాయపడతాయి.

కొయ్యకాళ్లను అస్సలు కాల్చొద్దు



రైతుల కొయ్యకాళ్లను అస్సలు కాల్చొద్దు. ఘట్‌కేసర్ మండలంలోని రైతులకు అవగాహన కల్పించాం. కొయ్యలను కాల్చితే వచ్చే నష్టాలను వివరించాం. కొయ్యలను భూమిలో కలిపి దున్నడం వల్ల భూసారం పెరిగి పంటల దిగుబడి పెరుగుతుంది. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలి.

- ఎంఏ బాసిత్, మండల వ్యవసాయాధికారి

ఎస్సీ వర్గీకరణపై ఈనెల 10న విచారణాత్మక అధ్యయనం

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిషన్ డిసెంబరు 10న రంగారెడ్డి కలెక్టరేట్‌లో విచారణాత్మక అధ్యయనం చేయనుంది. ఈమేరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ కొరకు బహిరంగ విచారణ చేయనున్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ విచారణకు ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ హాజరవుతున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఎస్సీ ఉప కులాల సంఘం నాయకులు అధికసంఖ్యలో బహిరంగ విచారణకు హాజరై వినతులు సమర్పించాలని ఆయన కోరారు.

సెలవుపై తాండూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్!

తాండూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి మందలింపుతో తాండూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిశంకర్ నొచ్చుకున్నారు. ప్రొటోకాల్ విషయంలో తనకు సంబంధం లేకున్నా మహేందర్‌రెడ్డి మందలించారని రవిశంకర్ తన పదవికి రాజీనామాకు సిద్ధమయ్యారు. ఈక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అనుచరులు రవిశంకర్ ఇంటికి వెళ్లి బుజ్జగించారు. ఆయన కొన్ని రోజులు సెలవుపై వెళ్లాలని నిర్ణయించుకున్నారు. సెలవు తాత్కాలికమేనని సూపరింటెండెంట్ పదవికి రాజీనామా చేయలేదని డీసీహెచ్‌వో ప్రదీప్ కుమార్ తెలిపారు.

ఎన్‌కౌంటర్లపై మంత్రి సీతక్క స్పందించాలి

నవాబుపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు, హత్యలు, ఎన్‌కౌంటర్లపై మంత్రి సీతక్క స్పందించాలని ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ నాగభూషణం అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామం, భావ ప్రకటనా స్వేచ్ఛ పకడ్బందీ అమలుకు అసెంబ్లీలో చర్చ జరిపి ఆచరణలో పెట్టాలన్నారు. పెద్దపల్లి రాణాపూర్ మాదన్నతో పాటు ఏడుగురు ములుగు జిల్లా వాసులపై జరిగిన ఎన్‌కౌంటర్‌పై వెంటనే స్పందించాలన్నారు. అసెంబ్లీలో చర్చ జరిపి బూటకపు ఎన్‌కౌంటర్లను అరికట్టాలని కోరారు.

రెండో రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహార దీక్షలో సమగ్ర శిక్షా ఉద్యోగులు

వికారాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించి తగిన న్యాయం చేయాలని సమగ్రశిక్షా ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండో రోజు కొనసాగింది. సమగ్రశిక్షా ఉద్యోగులు శనివారం వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట బైఠాయించి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా టీఎస్ఎస్‌యూఎస్ జిల్లా అధ్యక్షుడు కె.గంగ్యా నాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, లేకపోతే ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మెకు వెళతామని తెలిపారు. విద్యాశాఖలో అత్యంత క్రియాశీలక విధులను నిర్వహిస్తున్న సమగ్రశిక్షా ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. మెసెంజర్ అధ్యక్షుడు శ్రీశైలం, జిల్లా సమగ్ర శిక్షా అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వామినారాయణ్ విద్యార్థుల విజయబావుటా

ఐఎన్‌టీఎస్‌వో ఆధ్వర్యంలో నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్



స్వామినారాయణ్ గురుకులం విద్యార్థులు, టీచర్లు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వామినారాయణ్ ఇంటర్‌నేషనల్ గురుకుల పాఠశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి రెవెన్యూలోని శ్రీ స్వామినారాయణ్ గురుకుల్ పాఠశాల హాస్టల్ విభాగానికి చెందిన విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్(ఐఎన్‌టీఎస్‌వో) ఆధ్వర్యంలో నిర్వహించిన నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్‌లో విజయదుందుభి మోగించారు. గణిత, భౌతిక శాస్త్రాల్లో విద్యార్థుల పరిజ్ఞానాన్ని అంచనా వేయడానికి రూపొందించడానికి పరీక్ష నిర్వహించినట్లు నిర్వాహకుడు విజయభాస్కర్ తెలిపారు. స్వామినారాయణ్ గురుకుల్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన పరీక్షలో స్వామినారాయణ్ ఇంటర్‌నేషనల్ గురుకుల పాఠశాలకు చెందిన దాదాపు 350 మంది టెస్ట్‌లో ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. విద్యాసంస్థలకు చెందిన పరమపూజ్య సుఖవల్లభ దాస్‌జీ స్వామిజీ మాట్లాడుతూ.. ఈ జైత్రయాత్రను ఇలాగే ముందుకు సాగించాలని ఆనందం వ్యక్తం చేశారు. విజయం సాధించిన విద్యార్థులకు స్వామినారాయణ్ భగవాన్ ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని చెప్పారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్‌తో కలిసి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఈవో సతీష్‌రెడ్డి, పరమపూజ్య విశ్వదర్శన్ స్వామిజీ, విద్యార్థులు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

మేఘం.. మనోహరం



ప్రకృతిలో మార్పు కనిపించింది. గత రెండు రోజులుగా జనం ఎండ, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. శనివారం వాతావరణంలో ఏర్పడిన మార్పులతో చల్లని వాతావరణం ఏర్పడింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మేఘాలు దర్శనమిచ్చాయి. ఈ దృశ్యం తాండూరులో కనువిందు చేసింది. సాయంత్రం 5.30గంటల ప్రాంతంలో చిరుజల్లులు కురిశాయి. ఆకాశమంతా మేఘావృతమైంది. ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

- తాండూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి)

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



అంతారంలో పనులకు శంకుస్థాపన చేస్తున్న మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరు మండల పరిధిలోని అంతారం, దస్తగిరిపేట్ గ్రామాల్లో రూ.30 లక్షలతో నూతనంగా నిర్మించే సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ పనులకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేస్తామన్నారు. రైతులకు సంక్రాంతి నాటికి రైతుభరోసా అందిస్తామన్నారు. డీసీసీబీ వైస్‌చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఉత్తంచంద్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జర్నె నాగప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జర్నప్ప, ఉదయభాస్కర్‌రెడ్డి, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విన్‌టర్ ఫుడ్!

ఆహారం - ఆరోగ్యం

- సరిగా తినండి.. ఆరోగ్యంగా ఉండండి!
- ఈ సీజన్‌లో విటమిన్ సీ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి
- బాదం లాంటి గింజలూ ఆరోగ్యానికి మంచివే
- సూప్‌లకూ స్థానం కల్పించాలంటున్న పోషకాహార నిపుణులు

చలి పెరిగింది.. వాతావరణంలో ఏర్పడిన మార్పువల్ల కూడా ఉదయం వర్షపు జల్లులు, మబ్బులు కమ్ముకొని ఉంటోంది. దీనివల్ల సీజనల్ వ్యాధులతో పాటు జలుబు, దగ్గు బారిన పడుతున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. ఈ శీతాకాలంలో ఆరోగ్యంగా ఉండేందుకు మనం తినే ఆహారంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.



రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) సాధారణంగా శీతాకాలంలో చాలా మందికి ఆకలి మందగిస్తుందనే చెప్పొచ్చు. మసాలాలు ఉండే వంటకాలను తీసుకోవడానికి ఎక్కువమంది ఆసక్తి చూపుతుంటారు. కానీ, శీతాకాలంలో ఆరోగ్యం మెరుగుపడాలంటే కూరగాయలు, ఆకుకూరలతో పాటుగా సూప్‌లు, పెరుగు, సీజనల్ పండ్లు లాంటివి ఎక్కువగా తీసుకోవాలని పోషకాహార నిపుణు రాలు సబీనా తెలిపారు. మసాలాలు, వేయించిన ఆహారానికి దూరంగా ఉండాలన్నారు. ఉదయం అల్పాహారంగా జావ లేదా పాయసం తీసుకుంటే మంచిది. లేదా పండ్లు, బాదం గింజలు లాంటివి తీసుకుంటే శరీరానికి పోషకాలు కూడా లభిస్తాయి.

రోగ నిరోధక శక్తి మెరుగు కోసం..

శీతాకాలంలో రోగ నిరోధకశక్తిని మెరుగుపర్చుకోవడం చాలా ముఖ్యం. విద్యార్థులు, ఉద్యోగులు తప్పక పాటించాలి. జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయి.. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి.

శరీర వెచ్చదనం కోసం..

శీతాకాలంలో ఆరోగ్యంతో పాటు మన శరీరానికి వేడిని కలిగించే పదార్థాలను తీసుకోవాలి. ఖర్జూరాలు, నువ్వులు, పాలు, మాంసం, చేపలు తినడంవల్ల ఆరోగ్యానికి మంచిది. వేర్లతో కూడిన కూరగాయలు బంగాళదుంప, క్యారెట్, ఉల్లిపాయ, వెల్లుల్లి, అల్లం, ముల్లంగి, చిలకడదుంప లాంటివి కూడా తీసుకోవచ్చు. చల్లని కాలంలో శరీరం వెచ్చగా ఉండడానికి నియాసిన్ అధికంగా ఉన్న పదార్థాలను తీసుకోవచ్చు. గుడ్లు, పాలు, వెన్న, పెరుగు, మజ్జిగలో నియాసిన్ అధికంగా ఉంటుంది.

అంటువ్యాధులను ఎదుర్కోవాలంటే..

సీజనల్ అంటువ్యాధులతో పోరాడేశక్తి కావాలంటే జింక్ అధికంగా ఉన్న ఆహారం తీసుకోవాలి. బచ్చలికూరలో జింక్ సహా పలు రకాల విటమిన్‌లు అధికంగా ఉంటాయి. ఇవి గాక గుమ్మడి విత్తనాలు, నువ్వులు, చేపలు, చికెన్, గుడ్లలో కూడా జింక్ అధికంగా లభిస్తుంది

విటమిన్ సి అధికంగా ఉన్న పండ్లు తీసుకోవాలి..

శీతాకాలం రాగానే జలుబు, దగ్గు, జ్వరం లాంటి సీజనల్ వ్యాధులతో పాటుగా ఫ్లూ కూడా పెరిగే అవకాశం ఉంది. విటమిన్ సీ, బీటా కెరోటిన్ అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు తీసుకుంటే రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. క్యాబేజీ, గుమ్మడి, దానిమ్మ, బత్తాయి, ఉసిరి, రేగు, స్ట్రాబెర్రీ లాంటి వాటిలో ఈ విటమిన్స్ అధికంగా ఉంటాయి. ఈ సీజన్‌లో కారెట్, బొప్పాయి తింటే మంచిది. ఆకు కూరలు తీసుకోవటం వల్ల ఐరన్ సహా శరీరానికి అవసరమైన విటమిన్స్ అధికంగా లభిస్తాయి.

సూప్‌లు తీసుకోవాల్సిందే..

శీతాకాలంలో ఎలాంటి సూప్‌లు తీసుకోవాలంటే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్న పుదీనా లాంటి హెర్బ్స్‌తో పాటు వెజిటేబుల్ సూప్స్ తీసుకోవచ్చు. వాటికి కాస్త పసుపు, వెల్లుల్లి, మిరియాలు తప్పనిసరిగా జోడించాలి.

నీరు తప్పనిసరి..

ఏ సీజన్‌లో అయినా మంచి నీరు ఎక్కువగా తీసుకుంటే చర్మం కాంతివంతంగా ఉండడంతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుంది. కీరా లాంటివి తీసుకుంటే కొంతమేరకు శరీరానికి అవసరమైన నీటిని భర్తీ చేసుకునే అవకాశం ఉంది.

అక్రమ మైనింగ్‌పై అధికారుల నజర్

ఎక్మాయి శివారు నాపరాళ్ల గనుల్లో తవ్వకాల నిలిపివేత

లీజులు లేకుండా తవ్వితే కఠిన చర్యలు : తహసీల్దార్



ఎక్మాయి శివారులోని నాపరాతి గనుల్లో కటింగ్ మెషీన్ బెల్టులను తొలగింపజేస్తున్న తహసీల్దార్ వెంకటేష్

బషీరాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా చేపడుతున్న నాపరాళ్ల తవ్వకాలపై రెవెన్యూ అధికారులు నజర్ పెట్టారు. శనివారం బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్, ఎస్సై పి.శంకర్, సిబ్బందితో కలిసి మండలంలోని ఎక్మాయి శివారు సర్వే నంబర్ 147లోని నాపరాళ్ల గనుల్లో తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరుపడాన్ని తహసీల్దార్ స్వయంగా గుర్తించారు. అక్కడున్న వ్యక్తులను లీజు పత్రాలు చూపించాలని కోరగా నీళ్లు నమిలారు. దాంతో తహసీల్దార్ సీరియస్‌గా స్పందిస్తూ అక్రమ తవ్వకాలకు జరుపుతున్న గనుల్లో కటింగ్ మెషీన్ బెల్టులను తొలగించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అక్కడున్న వారితో నాపరాళ్ల తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని, లేకుంటే అక్రమ తవ్వకాలకు పాల్పడిన వారిని ఉపేక్షించబోమన్నారు. ఈక్రమంలోఅక్రమ తవ్వకాలకు సంబంధించి తహసీల్దార్ ఎదుట కొందరు గొడవకు దిగగా.. పోలీసులు జోక్యం చేసుకుని సముదాయించారు. ఇకపై అక్రమ తవ్వకాలు జరిపితే అక్రమార్కులపై క్రిమినల్ కేసులు పెడతామని తహసీల్దార్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఇదిలా ఉండగా అక్రమ తవ్వకాలను అడ్డుకోవాల్సిన మైనింగ్ శాఖ అధికారులకు ఇదంతా తెలిసినా.. ఇటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు స్థానికంగా వినిపించాయి.

డాక్టర్ శ్రీదేవికి ఉత్తమ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డు



కిషన్‌రెడ్డి నుంచి ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డు అందుకుంటున్న డా.శ్రీదేవి

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లో ఎన్టీఈపీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసినందుకు గాను డాక్టర్ శ్రీదేవి శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతులమీదుగా ఉత్తమ ప్రో గ్రామ్ ఆఫీసర్ అవార్డు అందుకున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ల సమీక్ష సమావేశాన్ని శనివారం ఎర్రగడ్డలోని టీబీ శిక్షణ ప్రదర్శన్ కేంద్రంలో నిర్వహించారు. సమావేశంలో ఉత్తమ ప్రదర్శన చేసిన ప్రోగ్రామ్ ఆఫీసర్లను అవార్డుతో సత్కరించారు. ఈసందర్భంగా జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి, జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది డాక్టర్ శ్రీదేవిని అభినందించారు.

ఘనంగా సుబ్రమణ్యేశ్వరస్వామి షష్టి వేడుకలు



కావడి నిర్వహిస్తున్న భక్తులు

చేవెళ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయం అయ్యప్పస్వామి, సుబ్రమణ్యేశ్వరుడి నామస్మరణతో మార్మోగింది. శనివారం సుబ్రమణ్యేశ్వర స్వామి షష్టి సందర్భంగా అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్పమాలధరణ భక్తులు సుబ్రమణ్యేశ్వరస్వామి వారి కావడి నిర్వహించారు. ఈమేరకు పట్టణ కేంద్రంలో ఊరేగింపు నిర్వహించారు. అర్చకులు, అయ్యప్ప మాలధరణ స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కందుకూరు : మండలంలోని తిమ్మాపురం గ్రామంలో నల్లపోచమ్మ ఆలయానికి శనివారం శంకుస్థాపన చేశారు. 35 ఏళ్ల క్రితం నిర్మించిన దేవాలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామ మాలసంఘం నాయకులు పునర్నిర్మాణం చేసేందుకు నిధులు సేకరించినట్లు నిర్వాహకుడు రామ్‌వంశీ తెలిపారు. త్వరలో ఆలయాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగమ్యగోచరం.. కార్మికుల జీవితం

- కాంట్రాక్టర్ల చేతిలో చితికిపోతున్న శ్రమజీవులు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పరిశ్రమల్లో ఇష్టారీతిన శ్రమదోపిడీ
- రెక్కలు ముక్కలు చేసినా.. శ్రమకు తగ్గ ఫలితం లేని వైనం
- పట్టని అధికారులు.. కార్మిక చట్టాలకు తూట్లు



పని కోసం వేచిచూస్తున్న కార్మికులు(ఫైల్)

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి సాయంత్రం వరకు రెక్కలు ముక్కలు చేసుకుని పనిచేసినా.. అవసరాలు తీరవు.. బతుకు బండి ముందుకు సాగదు. ఉన్న ఊరిలో పూట గడవని పరిస్థితి. ఊరుకాని ఊరికొచ్చి పనిచేసినా మారని దుస్థితి. అయినా, పిడికెడు అన్నం కోసం ఏదో ఒక పరిశ్రమలో కాంట్రాక్టు లేబర్‌గా పనిలో చేరి శ్రమ దోపిడీకి గురువుతున్న వారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఎందరో ఉన్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని రేయింబవళ్లు పని చేస్తూ జీవనం సాగిస్తున్న వేలాది మంది కార్మికుల జీవితాలు కాంట్రాక్టర్ల చేతిలో చితికిపోతున్నాయి. శ్రమజీవుల కష్టాల గురించి ఊసెత్తే నాథుడే కరువయ్యాడని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరానికి చేరువలో ఉన్న మేడ్చల్ జిల్లా పరిశ్రమలకు పెట్టింది పేరు. జిల్లాలో దాదాపు 35 ఏళ్ల క్రితం ప్రారంభమైన పారిశ్రామిక రంగం అంచలంచెలుగా ఎదుగుతూ నేడు వేలాది పరిశ్రమలకు చేరుకుంది. ఇందులో చిన్న, మధ్య, పెద్ద తరహా పరిశ్రమలే కాకుండా ఇతర వాణిజ్యపరమైన వ్యాపార సంస్థలు కూడా ఉన్నాయి. జిల్లాలో ఉన్న పరిశ్రమలు నేరుగా కార్మికులను తమ సంస్థలో చేర్చుకోకుండా కాంట్రాక్టర్ల ద్వారా పనుల్లో పెట్టుకునే విధానానికి అలవాటుపడ్డాయి. దాంతో ఇక్కడ ఉన్న పరిశ్రమల్లో దాదాపు 85-90వేల మంది కార్మికులకు వివిధ స్థాయిల్లో పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ప్రధానంగా వీరిలో అన్‌స్కిల్డ్ (ఎలాంటి నైపుణ్యంలేని వారు లేబర్ కేటగిరీ), స్కిల్డ్(నైపుణ్యత కలిగిన), సెమీస్కిల్డ్(కొద్దిపాటి నైపుణ్యత గలవారు), హైస్కిల్డ్(పూర్తి నైపుణ్యత గలవారు) కార్మికులుగా విభజించి పనుల్లో పెట్టుకుంటారు. కాగా, అన్‌స్కిల్డ్, స్కిల్డ్ కార్మికులను కాంట్రాక్టు పద్ధతిలో పనుల్లో పెట్టుకుని మిగతా రెండు రకాల కార్మికులను నేరుగా పరిశ్రమలు భర్తీ చేసుకుంటున్నాయి. దాదాపు 60 వేల మంది అన్‌స్కిల్డ్ కార్మికులను కాంట్రాక్టు పద్ధతిలో ఇక్కడి పరిశ్రమలు పనుల్లో పెట్టుకుంటున్నాయి. దాంతో ఇక్కడ కార్మికులకు డిమాండ్ పెరగడంతో వారిని సమకూర్చే సంస్థలు పుట్టగొడుగుల్లా వెలిసి నిరుపేదల కష్టాన్ని సొమ్ము చేసుకుంటున్నాయి. కాంట్రాక్టు పద్ధతిలో పనుల్లో చేరే కార్మికుల సంక్షేమం ఇక్కడ ప్రశ్నార్థకంగా మారింది. కాంట్రాక్టు లైసెన్స్ పొందిన సంస్థ పనితీరును పరిశీలించి ప్రతీనెల కార్మికుల సంక్షేమం గురించి కల్పించిన ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు చెల్లిస్తున్నారా? లేదా! అనే విషయాల గురించి పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతిలో పనుల్లో చేరే కార్మికుల సంక్షేమం గురించి పూర్తి బాధ్య కాంట్రాక్టర్‌పై ఉంటుంది. అలాగే ప్రతీనెల వేతనం సక్రమంగా చెల్లించటంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్‌లను కూడా కాంట్రాక్టరు చెల్లించాల్సి ఉంటుంది. కాగా, ఇక్కడ పరిశ్రమల్లో ఉన్న కొందరు కాంట్రాక్టర్లు కార్మికులకు నెలవారి చాలీచాలని వేతనంతోనే సరిపెడుతున్నారు. పరిశ్రమల్లో కాంట్రాక్టు పద్ధతిలో కార్మికులను పెట్టే సంస్థల్లో చాలావాటికి కార్మికశాఖ అనుమతులు కూడా ఉండకపోవటం గమనార్హం. ఉన్నవారు లైసెన్స్ రెన్యూవల్ చేయించకుండా వ్యాపారాన్ని నడుపుతున్నారు. ఒక పరిశ్రమలో కాంట్రాక్టు లేబర్లను పెట్టుకోతలచినవారు సంబంధిత శాఖతో అనుమతి పొందాల్సి ఉంటుంది. కార్మికశాఖ అనుమతి పొందిన సంస్థలు ఎంతమంది కార్మికులను సమకూర్చగలరన్న విషయాన్ని ముందుగా తెలపాల్సి ఉంటుంది. 50మందికి అనుమతి పొంది ఉంటే.. అంత మందినే పనుల్లో పెట్టుకోవాలి. కాగా, ఇక్కడి పరిశ్రమల్లో 50మందికి అనుమతి పొంది ఉన్న సంస్థలు 500 మంది కార్మికులను పనుల్లో పెట్టి తమ వ్యాపారాన్ని నడుపుతున్నాయి. కాంట్రాక్టు లైసెన్స్ ఉన్నవారు ఒకే పరిశ్రమలో కార్మికులను పెట్టుకోవాలి. ఇక్కడ ఉన్న కొన్ని సంస్థలు ఒకే లైసెన్స్‌పై 5 నుంచి 6 పరిశ్రమల్లో కార్మికులను పనిలో పెట్టుకుంటున్నాయి. సంబంధిత శాఖ అధికారులకు తెలిసినా నెలనెలా మామూళ్లకు అలవాటుపడి కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతున్నారు.

కార్మిక శాఖ అధికారుల వైఫల్యం



లేబర్ కాంట్రాక్టర్ల పనితీరును పర్యవేక్షించాల్సిన సంబంధిత కార్మికశాఖ అధికారుల వైఫల్యం కారణంగా కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవటం లేదు. అన్‌స్కిల్డ్ కేటగిరీలో పనిచేసే కార్మికులకు నెలవారి కనీస వేతనం రూ.12,300 ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, కాంట్రాక్టర్లు కనీసం రూ.9,000 కూడా చెల్లించటం లేదు. ఈఎస్ఐ, పీఎఫ్‌లు సక్రమంగా కట్టకపోవటంతో ప్రమాదానికి గురైన కార్మికులకు వైద్యసేవలు అందటం లేదు. కార్మికుల అవసరాలను ఆసరాగా చేసుకుని పనులు చేయిస్తున్నారు. **- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్**

శ్రమ దోపిడీకి గురవుతున్నాం



పరిశ్రమలో పనిచేసే కార్మికులతో 10గంటలు పని చేయిస్తూ.. 8గంటలకే వేతనం చెల్లిస్తున్నారు. అదనంగా పనిచేసిన వేళలకు సంబంధించిన వేతనం గురించి నిలదీస్తే నిర్దాక్షిణ్యంగా పనుల నుంచి తొలగిస్తున్నారు. ఒక్కో కార్మికుడి వేతనంలో నెలకు వెయ్యి నుంచి రెండు వేల వరకు కాంట్రాక్టర్లు వసూలు చేసి కనీసం ఈఎస్ఐ, పీఎఫ్‌లు కూడా కట్టడం లేదు. తమ హక్కుల గురించి నిలదీస్తే పనుల నుంచి తొలగించటంతో పాటు ఇతర పరిశ్రమల్లో కూడా పని దొరక్కుండా చేస్తున్నారు. **- శేఖర్, కార్మికుడు**

ఈఎస్ఐ, పీఎఫ్‌లు హాంఫట్!

చాలావరకు లేబర్ కాంట్రాక్టర్లు తమ వద్ద ఉన్న కార్మికుల సంక్షేమం కోసం ప్రతీనెల చెల్లించే ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులను మింగేస్తున్నారన్న ఆరోపణలు వినబడుతున్నాయి. ప్రతీనెల కార్మికుని వేతనం చెల్లించటంతో పాటు అతని సంక్షేమం కోసం ప్రభుత్వం కల్పించిన ఈఎస్ఐ, పీఎఫ్‌ల చెల్లింపు బాధ్యత కూడా సదరు కాంట్రాక్టరుపై ఉంటుంది. కాగా, ఇక్కడ ఉన్న కాంట్రాక్టర్లు చాలావరకు ఈ నిబంధనను పాటించటం లేదు. పరిశ్రమలో పనిచేసే వేళ కార్మికుడు ఏదైనా ప్రమాదానికి గురైన వేళ అతని చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తే ఈఎస్ఐ చెల్లించలేదన్న విషయం బట్టబయలవుతోంది. దాంతో కార్మికులు ప్రమాదానికి గురైన వారిని ఆదుకోవాలని యాజమాన్యాలపై ఒత్తిడి తీసుకొచ్చినా యాజమాన్యాలు మాత్రం తమకు సంబంధం లేదంటూ చేతులెత్తేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులు!

జిల్లాలో మేడ్చల్, బాలానగర్, చర్లపల్లి, ఈసీఐఎల్ తదితర ప్రాంతాలతో పాటు నగరశివారులోని ప్రాంతాల్లో పెద్దఎత్తున గోదాముల్లో ఉన్న పరిశ్రమల్లో లేబర్ కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న కార్మికుల్లో చాలామంది స్థానికేతరులు, బిహార్, ఒడిషా తదితర రాష్ట్రాలకు చెందినవారే. అంతేకాకుండా ఏపీలోని శ్రీకాకుళం, తెలంగాణలోని పలు జిల్లాలకు చెందినవారూ ఉన్నారు. ఇక్కడ కార్మికులకు కనీస వేతన చట్టాన్ని కూడా అమలు చేయటం లేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి. పరిశ్రమల యాజమాన్యాల నుంచి 8గంటల పనికిగాను ఒక్కో కార్మికుడు రోజువారీగా రూ.500-600 తీసుకుంటున్నారు. కార్మికులకు మాత్రం రూ.300-400 వరకు చెల్లిస్తున్నారు. దీనికితోడు 8 గంటలకు బదులుగా రెండు గంటలు అదనంగా పని చేయించుకొని ఆ డబ్బులు కూడా కాంట్రాక్టర్లే ఉంచుకుంటున్నారు. దాంతో ప్రతీ కార్మికుడి నెల వేతనంలో రూ.6000-9000 వరకు కాట్రాక్టర్లు సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినబడుతున్నాయి. పరిమితికి మించి కార్మికులను పరిశ్రమల్లో పెట్టుకుని వారి కష్టార్జితాన్ని సొమ్ము చేసుకుంటున్నా లేబర్ కాంట్రాక్టు సంస్థల గురించి పట్టించుకునే నాథుడే లేడు. కాగా, సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నందునే ఈ పరిస్థితి దాపురించిందని పలువురు కార్మికులు ఆరోపిస్తున్నారు. శ్రమ దోపిడికీ గురవుతున్న వారిలో చాలామంది మహిళా కార్మికులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి యువకుడు ఆత్మహత్య

వికారాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ మండలం, పీరంపల్లి గ్రామానికి చెందిన బందెన్నోళ్ల పోషిరెడ్డి(30) గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్యే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డాడు. ముందుగా మీరు కొన్ని డబ్బులు చెల్లిస్తే 10రెట్లు డబ్బు మీకు లోన్ రూపంలో వస్తుందని నమ్మబలకడంతో ముందుగా రూ.37,000 చెల్లించిన పోషిరెడ్డికి అనుకున్నట్లుగా లోన్‌రాలేదు. పైగా మరికొన్ని డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేయడంతో ఆవేదనకు గురైన పోషిరెడ్డి పొలం వద్ద పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు అతన్ని వికారాబాద్ మిషన్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బతికే అవకాశం లేదని చెప్పడంతో ఇంటికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో పోషిరెడ్డి మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యేపై దుష్ప్రచారం సరికాదు

- సోషల్ మీడియాలో పోస్టులపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం
- చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్ రూరల్/చౌదరిగూడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంత మంది వ్యక్తులు బలహీన వర్గానికి చెందిన ఎమ్మెల్యే శంకర్‌పై కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అనని మాటలను అన్నట్టు సోషల్ షోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకొని, దుష్ప్రచారం పునరావృతం కాకుండా కట్టడి చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో శ్రీనునాయక్, పి.రాజేష్‌గౌడ్, నాగి సాయిలు, అనీల్, జాంగారి రవి, నెహ్రూనాయక్, యాదయ్య తదితరులు ఉన్నారు. అలాగే ఎమ్మెల్యే శంకర్‌పై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఉమ్మడి కొందుర్గు మండల కాంగ్రెస్ నాయకులు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ పోలీస్‌స్టేషన్లలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసినవారిలో జిల్లేడ్ చౌదరిగూడలో రవికుమార్, చందునాయక్, వెంకటేష్, కొందుర్గులో లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, మాణెయ్య, పెంటయ్య, శ్రీను, వేణుగోపాల్, రమేష్‌లు ఉన్నారు.

యువ నాయకులే పార్టీకి పట్టుగొమ్మలు



యూత్ కాంగ్రెస్ నాయకులను శాలువా కప్పుతున్న డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): యువ నాయకులే కాంగ్రెస్‌కు పట్టుగొమ్మలని పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. యూత్ కాంగ్రెస్ గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డ ఎర్రోళ్ల సంతోష్ శనివారం హరివర్ధన్‌రెడ్డిని మర్యాదపూరకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందన్నారు. కొత్తగా పదవులు పొందిన యువ నాయకులు పార్టీకోసం పని చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి యువకులు ప్రచారం చేయాలన్నారు. కేంద్రంలో రాహుల్ గాంధీ, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని యువ నాయకులు తమ కార్యకలాపాలు చేపట్టాలని కోరారు.

అన్నివర్గాలకు శ్మశానవాటికల ఏర్పాటు



పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ అశోక్

పరిగి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాలకు వేర్వేరుగా శ్మశానవాటికల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. శనివారం 6వ వార్డులోని సుల్తాన్‌నగర్‌లో ఎస్సీల శ్మశానవాటిక నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసుకునే శ్మశాన వాటికల్లోనే అంత్యక్రియలు నిర్వహించుకోవాలని సూచించారు. అందులో నీటి వసతి కూడా కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బి.నాగేశ్వర్‌రావు, టి.వెంకటేశ్, జె.శ్రీనివాస్, నాయకులు మొగులయ్య, భీమన్న, యాదయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాద క్షేత్రాలు.. ఆదరణకు దూరం!



ఏకశిల పర్వతంపై వెలసిన పాంబండ రామలింగేశ్వరస్వామి దేవాలయం

(3వ పేజీ తరువాయి)

ఇక్కడి ప్రజల నమ్మకం. క్షేత్రం ఉన్న పర్వతం సుమారు మూడు కిలో మీటర్ల విస్తీర్ణం మేరకు పాము ఆకారంలో ఉంది. ఏకశిల పర్వత(పాంబండ) క్షేత్రంపై వెలసిన ఈ కోనేటిలో స్నానమాచరిస్తే సర్వరోగాలు మాయమవుతాయని స్థానిక ప్రజలు విశ్వాసం. కోనేటి నీటిని పంట పొలాల్లో చల్లుకుంటే అధిక దిగుబడి వస్తుందని ఇక్కడి రైతులు నమ్ముతారు.



కొండలు, కోనల మధ్య ఉన్న దామగుండం సెలయేరు

దామగుండం ఆలయానికి ఘన చరిత్ర

దట్టమైన అడవులు, ఎత్తైన కొండల మధ్య ఏడాది పొడవునా పారే సెలయేరు ఇక్కడి ప్రజలను ఎంతో ఆకట్టుకుంటోంది. ఇది పూడూర్ మండల కేంద్రానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉంది. ఈ దామగుండం పుణ్య క్షేత్రానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఇక్కడి ప్రకృతి రమణీయత భక్తులను అలరిస్తుంది. చుట్టూ ఉన్న ఎత్తైన కొండలు, గుట్టలు, చెట్లు ఈ ప్రాంతానికి వచ్చే వారిని మంత్ర ముగ్ధులను చేస్తాయి. ఇలాంటి సుందరమైన ప్రాంతాన్ని ఒక్కసారైనా సందర్శించాలనే తపన ఇక్కడి వారిలో కలుగుతుంది.

'లక్నాపూర్'కు సందర్శకుల తాకిడి

పరిగి మండలం లక్నాపూర్ ప్రాజెక్టు వందల ఎకారల విస్తీర్ణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంది. ఈ ప్రాజెక్టు నిండా నీటితో కళకళలాడితే ఎంతో అందంగా కనువిందు చేస్తుంది. ప్రాజెక్టు కట్ట, అలుగు, తూము తదితర ప్రాంతాలు పర్యాటకులను అకట్టుకుంటున్నాయి. ఈ ప్రాజెక్టును సందర్శించేందుకు అధిక సంఖ్యలో విద్యార్థులు, దూర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వస్తుంటారు. ఈ ప్రాంతాన్ని సైతం ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా మారిస్తే పర్యాటకులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

800 ఏళ్ల చరిత్ర

ఈ క్షేత్రానికి సుమారు ఎనిమిది వందల ఏళ్ల ఘనమైన చరిత్ర ఉందని పురాణాల ద్వారా తెలుస్తుంది. పూర్వం ఒక మునీశ్వరుడు దాదాపు 800 ఏళ్ల క్రితం ఈ ప్రాంతంలో తపస్సు ఆచరించాడనే ప్రతీతి. ఈ ఆలయం ఉత్తరం వైపున ఉన్న గుహలో ఆయన తపస్సు చేసినట్లు చెప్పుకుంటారు. ఈ గుహ ఇప్పటికి ఉంది. దామగుండం ఆలయానికి సమీపంలోనే ఓ పుష్కరిణి కూడా నిర్మించారు. ఈ పుష్కరిణిలో స్నానమాచరిస్తే ఏడు జన్మల పాపాలు తొలగిపోతాయనేది ఇక్కడి భక్తుల విశ్వాసం. పరిగి, వికారాబాద్, తాండూర్, చేవెళ్ల నియోజకవర్గాల గ్రామాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు.

లక్నాపూర్‌లో బోటింగ్ ఏర్పాటు చేయాలి



పరిగి ప్రాంతానికి తలమానికంగా నిలుస్తున్న లక్నాపూర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా మార్చాలి. నిత్యం అనేక మంది పర్యాటకులు ఈ ప్రాజెక్టును సందర్శిస్తుంటారు. బోటింగ్‌ను కూడా ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. **- ఎ.రవి, పరిగి**

పర్యాటక కేంద్రాలుగా మారుస్తాం



పరిగి ప్రాంతంలో వీలుగా ఉన్న అన్ని ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా మారుస్తాం. మొదటగా లక్నాపూర్ ప్రాజెక్టును పర్యాటకంగా మారుస్తాం. ఇక్కడ బోటింగ్‌కు ఏర్పాటు చేశారు. పాంబండతో పాటు, ఇతర ప్రాంతాలకు అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. **- డా. టి.రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి**

గట్టిప్పలపల్లిని మండల కేంద్రం చేయాలి



దీక్షలో జేఏసీ నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):ఈనెల 10వ తేది వరకు గట్టిప్పలపల్లి ని మండల కేంద్రంగా ప్రకటించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. అన్ని అర్హతలు ఉన్న గట్టిప్పలపల్లి ని మండల కేంద్రంగా ప్రకటించకుండ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని వారు ఆరోపించారు. తలకొండల్లి మండలం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 37వ రోజుకు చేరాయి. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. దీక్షలో నాయకులు కృష్ణయ్య, గౌస్, చెన్నయ్య, నాగయ్య, సత్తయ్య, బాలయ్య, నవీన్, మల్లయ్య రాములయ్య, జేఏసీ ఛైర్మన్ అశోక్ గౌడ్, వైస్ చైర్మన్ ఆంజనేయులు గౌడ్, శరత్ చంద్ర తదితరులు ఉన్నారు.

అరిస్టాటిల్ కాలేజీలో ఘనంగా ఫ్రెషర్ డే



మొయినాబాద్ రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిలుకూరు పరిధిలోని అరిస్టాటిల్ పీజీ కళాశాలలో శనివారం ఫ్రెషర్ డే ఘనంగా జరిగింది. నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులు తోటివారిని పరిచయం చేసుకున్నారు. కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డిలు హాజరై మాట్లాడారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా క్యాంప్ కార్యాలయం

● ఎనిమిదేండ్లుగా వృథాగా ఉంటున్న ఎమ్మెల్యే ఆఫీసు



మహేశ్వరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ భవనం

మహేశ్వరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వాస్తు దోషమో.. రాజకీయ స్వార్థమో తెలియదు గానీ.. మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో కోటి రూపాయలతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ భవనం ఆరేళ్లుగా వృథాగా ఉంటోంది. 6-9-2018న అప్పటి ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ప్రారంభించిన ఈ భవనం నేటికీ వినియోగంలోకి రాలేదు. కోటి రూపాయలతో మహేశ్వరంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నిర్మించి ఉన్నప్పటికి 2018లో ఎమ్మెల్యేగా గెలిచిన పి.సబితారెడ్డి మహేశ్వరంలోని క్యాంప్ కార్యాలయం వైపు కన్నెత్తి చూడలేదు. జిల్లెలగూడలో నూతన క్యాంప్ కార్యాలయాన్ని నిర్మించారు. దీంతో మహేశ్వరంలో ఉన్న క్యాంప్ కార్యాలయాన్ని ఒక్క రోజుకూడా ప్రజాప్రతినిధులు వినియోగించలేదు. అన్ని సౌకర్యాలతో నిర్మించిన ఈ కార్యాలయాన్ని వేరే ఇతర ప్రభుత్వ ఆఫీసులకు వాడకునే వీలున్నా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఈ బిల్డింగ్‌ను ప్రజాప్రయోజనాల కోసం వినియోగించడంపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు దృష్టి సారించడం లేదోనని ప్రజలు అనుకుంటున్నారు. ఇప్పటికైనా ఏదో ఒక ప్రభుత్వ కార్యాలయంగా దీనిని వాడుకోవాలని అధికారులకు ప్రజలు సూచిస్తున్నారు.



ప్రారంభోత్సవ శిలాఫలకం

యూత్ కాంగ్రెస్ బలోపేతం కావాలి

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేసేలా కృషిచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అందె మోహన్, షాద్‌నగర్ తాలూకా అధ్యక్షుడు పి.రాజేష్‌గౌడ్, క్యాడర్‌ను ఆయన శనివారం క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఎం.శ్యాంసుందర్‌రెడ్డిలతో కలిసి సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మోహన్ రెండోసారి విజయం సాధించడం గొప్ప విషయమన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి యూత్ కాంగ్రెస్ క్యాడర్ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారుల ఘన విజయానికి కృషిచేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.



నాయకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకర్, ప్రతాప్‌రెడ్డి తదితరులు

క్రైం కార్నర్

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్.. ఒకరి మృతి



ప్రమాదంలో మృతిచెందిన బుచ్చయ్య

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల పరిధి సాగర్ ప్రధాన రహదారి కోహెడ్ క్రాసింగ్ వద్ద శనివారం బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నాంపల్లికి చెందిన పగిల్ల బుచ్చయ్య (60), అతడి స్నేహితుడు కుమార్ బైక్‌పై మంగల్‌పల్లికి వచ్చి తిరిగి వెళ్తూ కోహెడ క్రాసింగ్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టారు. బైక్ వెనక కూర్చున్న బుచ్చయ్య తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. కుమార్ గాయపడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

తప్పుడు పత్రాలతో ఐదెకరాల భూమి కబ్జా

● పోలీస్ స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు

చేవెళ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): తప్పుడు పత్రాలతో ఐదెకరాల భూమిని కబ్జా చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన వెలుగులోకొచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. అంతారంలో సర్వే నంబర్ 172లో 5ఎకరాల భూమిని హైదరాబాద్‌కు చెందిన డీవీ.పున్నయ్యశర్మ 2006లో కొన్నారు. అనంతరం ఆయన ఆస్ట్రేలియాకు వెళ్లిపోయారు. ఆ భూమిపై గ్రామానికి చెందిన ఓ నాయకుడు నకిలీ పత్రాలు సృష్టించి తన డ్రైవర్ సాయంతో తన కుటుంబీకుల పేరున మార్పించుకున్నాడు. ఇటీవల విదేశాల నుంచి వచ్చిన పున్నయ్యశర్మ అంతారంలో ఉన్న తన భూమి వద్దకు వెళ్లి చూడగా వేరే వారు సాగుచేసుకుంటున్నట్లు గుర్తించారు. ఈ భూమి తమదేనని కబ్జాలోని వారు చెప్పడంతో పున్నయ్యశర్మ నివ్వెరపోయారు. ఈసీ పరిశీలించగా రామగళ్ల రాజు 2019లో నకిలీ డాక్యుమెంట్‌తో అప్పటి సబ్‌రిజిస్ట్రార్ రాజేందర్ సాయంతో ఆలంపల్లి మహేందర్‌రెడ్డి పేరుట రిజిస్ట్రేషన్ చేసినట్టు గుర్తించాడు. దీంతో పున్నయ్య ఈ నెల 2న చేవెళ్ల ఇన్‌స్పెక్టర్ భూపాల్ శ్రీధర్, ఏసీపీ కిషన్‌లను కలిసి రామగళ్ల రాజు, ఆలంపల్లి మహేందర్‌రెడ్డి, సాక్షులు తంగడపల్లి రాధకృష్ణారావు, అనంతరాములపై ఫిర్యాదు చేశాడు. అయితే ఫిర్యాదు చేసి ఐదు రోజులైనా కేసు నమోదు చేయలేదు. దీంతో బాధితుడు శనివారం మీడియాను సంప్రదించడంతో విషయం బయటకొచ్చింది. దీనిపై సీఐ స్పందిస్తూ ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

వెంటనే రైతుభరోసా ఇవ్వాలి

తలకొండపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఇస్తానన్న రైతుభరోసా ఆర్థిక సాయాన్ని వెంటనే ఇవ్వాలని తలకొండపల్లి మాజీ జెడ్పీటీసీ పద్మనర్సింహ, మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య అన్నారు. రైతుబంధు స్థానంలో రైతుభరోసా కింద ఎకరాకు ఏటా రూ.15వేల పెట్టుబడి సాయం ఇస్తామన్న కాంగ్రెస్ ఏడాదిగా మాట తప్పి మోసగిస్తోందన్నారు. తలకొండపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో రైతు రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో చేయలేన్నారు. వానాకాలం రైతు బంధు/భరోసా ఏదీ ఇవ్వక ఎగనామం పెట్టారన్నారు. రైతుబంధును వెంటనే ఇవ్వకుంటే రైతులను ఏకం చేసి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు కటికెల పాండు, నర్సింహ, యాదయ్య, గోవర్దన్, రాజు, గణేష్, కృష్ణ ఉన్నారు.



మాట్లాడుతున్న నర్సింహ, జ్యోతయ్య

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



చౌదరిగూడ: సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ జగదీశ్వర్

చౌదరిగూడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ జగదీశ్వర్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవ సంబరాల్లో భాగంగా శనివారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల గ్రామాల్లో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలను అధికారులు ప్రారంభించారు. చౌదరిగూడ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్, జీహెచ్ఎం సునీత పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో 2శాతం స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగావకాశాలుంటాయని చెప్పారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నీలామోహన్ నాయక్, పంచాయతీ కార్యదర్శి పాండు రంగంగౌడ్, పీఈటీ శిరీష పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సీఎం కప్ క్రీడా పోటీలు ఇబ్రహీంపట్నంలోని ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఎంఈవో హీర్యానాయక్ క్రీడలను ప్రారంభించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పాఠశాలల విద్యార్థులకు బహుమతులందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్, స్పోర్ట్స్ జోనల్ సెక్రటరీ సుశీల, పీఈటీ రాజశేఖర్ పాల్గొన్నారు.

కందుకూరు: విద్యారంగ సంస్థల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని కాంగ్రెస్ మండల కో-ఆర్డినేటర్ అఫ్జల్ బేగ్, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు దీక్షత్‌రెడ్డి అన్నారు. అలేటి ప్రభాకర్ ఆధ్వర్యంలో నేదునూరు ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాల్లో మాట్లాడారు. విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం, మెస్‌చార్జీల పెంపు, ఇంటిగ్రేటెడ్ స్కూల్, స్కిల్‌డెవలప్‌మెంట్ కాలేజ్ ఏర్పాటుతో ఈ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు మెరుగవుతాయన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి విద్యార్థులు పాలాభిషేకం చేసి పండ్లు పంపిణీ చేశారు.



ఇబ్రహీంపట్నంలో ఖోఖో ఆడుతున్న బాలికలు

నాయకులు వి.బాబు, ఎన్ఎస్‌యూఐ నాయకులు శివ, నయీమ్, కార్తీక్, శ్రీకాంత్, టీచర్లు పాల్గొన్నారు.

తలకొండపల్లి: తలకొండపల్లి మండలంలో సీఎం కప్ క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంపీడీవో శ్రీకాంత్ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని కోరారు. క్రీడలు మానసిక వికాసానికి దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కిసాన్‌సెల్ కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అజీమ్, డీసీసీ కార్యదర్శి రవీందర్‌యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి సత్యం పాల్గొన్నారు.



కందుకూరు: నేదునూరు పాఠశాలలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



తలకొండపల్లిలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో

పంచాయతీల్లో ఓటరు లిస్టు ప్రదర్శన



చేవెళ్ల: ఆలూర్‌లో ఓటరు జాబితాను ఉంచుతున్న ఎంపీడీవో

చేవెళ్ల/యాచారం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అన్ని పంచాయతీల్లో శనివారం ఓటరు లిస్టులు ప్రదర్శించామని చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు తెలిపారు. పోలింగ్‌స్టేషన్ల వారీగా ఎన్నికల ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచారు. ఆమె మాట్లాడుతూ.. పంచాయతీల్లో తుది ఓటరు జాబితాను ఉంచామన్నారు. ప్రజలు తమ పేర్లను చెక్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవీందర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు. యాచారం మండల అధికారు లు ఓటర్ లిస్టును ప్రదర్శించారు. మండల పరిషత్‌లో ఎంపీడీవో నరేందర్ రెడ్డి, ఎంపీవో శ్రీలత, పర్యవేక్షణాధికారి శైలజ, యాచారం, గున్‌గల్, నానక్‌నగర్, కుర్మిద్ద, మాల్, తాటిపర్తి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఓటర్‌లిస్టును ప్రదర్శించారు.



నానక్‌నగర్ పంచాయతీలో ఓటర్ లిస్ట్ ప్రదర్శన

పారిశుధ్య కార్మికులకు మంకీ క్యాప్‌ల పంపిణీ

కొత్తూర్, డిసెంబరు 7:(ఆంధ్రజ్యోతి) చలి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు కౌన్సిలర్ హేమదేవేందర్ ముదిరాజ్ శనివారం మంకీ క్యాపులను పంపిణీ చేశారు. కార్మికులు తెల్లవారుజామునుంచే విధుల్లో ఉంటున్నందున, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని చిన్న సాయం చేస్తున్నట్లు కౌన్సిలర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్మికులు కౌన్సిలర్ హేమకు కృతజ్ఞతలు తెలిపారు.



కార్మికులకు మంకీ క్యాప్‌లను అందజేస్తున్న కౌన్సిలర్ హేమదేవేందర్

సీఎం కప్ పోటీలకు పేర్లు నమోదు చేసుకోవాలి

కొత్తూర్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కప్ పోటీల్లో క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ బాలాజీ అన్నారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు మున్సిపల్ గ్రౌండ్‌లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, యోగ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనదలిచిన వారు శ్రీలత పీడీ-ఇన్ముల్‌నర్వ(9704941071), మోనలీన పీడీ-పెంజర్ల(6305248491), నవనీత పీడీ-కొత్తూర్(9963081675) నంబర్లలో సంప్రదించాలని కమిషనర్ పేర్కొన్నారు.

పనిచేసే నేతలను ఎన్నుకుంటేనే ఫలితం

● ఎంపీ డీకే.అరుణ కృషితో పాలమూరులో నవోదయ విద్యాలయం



మాట్లాడుతున్న పి.విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం పనిచేసే నాయకులను ఎన్నుకుంటే సమాజానికి ఉపయోగపడే పనులు జరుగుతా యని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం కేశంపేటలో పార్టీ మండలాధ్యక్షుడు రొల్ల రాఘురామలుగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 30సంవత్సరాలుగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో నవోద య పాఠశాల ఏర్పాటుకు ఏ నాయకుడూ కృషిచేయలేదన్నారు. డీకే అరుణ ఎంపీగా గెల్చిన వెంటనే ఈ ప్రాంతం వారికి నాణ్యమైన విద్యా అందిచాలనే ఉద్దేశ్యంతో పాలమూరుకు నవోదయ విద్యాలయం కేటాయించేలా కృషి చేశారని అన్నారు. ఇందులో 5వ తరగతి నుంచి 12 తరగతి వరకు బోధన, వసతి ఉంటుందని తెలిపారు. రూ.90కోట్లతో నిర్మిం చే విద్యాలయంలో 600మంది విద్యార్థులు చదువుకునే సౌకర్యం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా డీకే ఆరుణకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి పద్మకృష్ణయ్య, అనెమోని కృష్ణయ్య, పగిటిపాల కోటి తదితరులు పాల్గొన్నారు.

'బడుగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి'



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న భీం భరత్

మొయినాబాద్ రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషిచేస్తోందని చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి భీంభరత్ అన్నారు. శనివారం తన నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కులను అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీలను అమలుచేస్తోందన్నారు. సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి గౌరీ సతీష్, సీనియర్ నాయకులు సత్యనారాయణ, పునాణం వీరభద్రస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు మాణెయ్య, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, వెంకటరెడ్డి, గడ్డం వెంకటరెడ్డి భిక్షపతి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



కందుకూరు: చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు/యాచారం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిరుపేదలకు వైద్యసేవలందించేందుకు మంజూరుచేస్తున్న సీఎంఆర్‌ఎఫ్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. వివిధ గ్రామాల లబ్ధిదారులకు శనివారం మీర్‌పేటలోని క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. సర్కారు సీఎంఆర్‌ఎఫ్ నిధులను పెంచాలని కోరారు. 36 మందికి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, ఇందిరదేవేందర్, రాములు, నాయకులు రామక్రిష్ణారెడ్డి, ఇందిరదశరథ, అనంద్, మేఘనాథ్‌రెడ్డి, జయేందర్‌ముదిరాజ్, లక్ష్మీనర్సింహారెడ్డి, వెంటకేష్, రేవంత్‌రెడ్డి, కార్తీక్, దేవేందర్, జి.కొండల్‌రెడ్డి, దేవీలాల్‌నాయక్, పెద్ద నర్సింహ పాల్గొన్నారు. ఆపదలో ఉన్న పేదలను ఆదుకుంటానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మేడిపల్లికి చెందిన గడ్డం రాములుకు రూ. 2.5లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, ముంత జంగయ్య, గడ్డం కుమార్, గడ్డం శ్రీకాంత్, జంగయ్య ఉన్నారు.



గడ్డం రాములుకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

యాచారం/చౌదరిగూడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):తాము చెప్పిన పాఠాలు శ్రద్ధతో విని ఉన్నత చదువులు చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని, ప్రతీ విద్యార్థి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని యాచారం మండలం నందివనపర్తి ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎ.వెంకటరామశాస్త్రి అన్నారు. శనివారం పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని జరపుకున్నారు. కార్యక్రమంలో టీచర్లు కిషన్, శ్రీనివాస్, వెంకటేషం, అండాలు, శిరీష, చందన, విజయరాణి, పద్మలత, అరుణ, పద్మశ్రీ, లక్ష్మణ్ పాల్గొన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల స్కూలులో స్వయం పాలన దినోత్సవాన్ని హెచ్ఎం రాములు అధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్‌గా ఫారియా, డీఈవోగా సిద్ధార్థ, ఎంఈవోగా తరుణ్‌తేజ్, ఎచ్ఎంగా మణికంఠ వ్యవహరించారు. కాంప్లెక్స్ హెచ్ఎం సునీత, టీచర్లు శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌కుమార్, శివాజీ, అఫ్రీన్‌బేగం పాల్గొన్నారు.



చౌదరిగూడ: రావిర్యాల స్వయం పాలన దినోత్సవంలో విద్యార్థులు

గుట్టుగా గంజాయి దందా

(3వ పేజీ తరువాయి)

భీంభరత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా 1550 గ్రాముల గంజాయి లభ్యమైంది.

● జార్ఖండ్ నుంచి తీసుకొస్తున్న కిలో గంజాయి(142 ప్యాకెట్లు)ని బొంగులూర్ గేటు సమీపంలో ఎల్బీనగర్ ఎస్‌వోటీ, ఆదిభట్ల పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు.

● కొంగరకలాన్ కల్వకోలు లక్ష్మీదేవమ్మ ఫంక్షన్ హాల్ సమీపంలో ఒడిశాకు చెందిన ఇద్దరు గంజాయి అమ్ముతుండగా ఆదిభట్ల పోలీసులు అదుపులోకి తీసుకొని వారినుంచి 5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

● వండర్‌లా సమీపంలో ఇటుక బట్టీల వద్ద పనిచేసే వారికి గంజాయి ఇవ్వడానికి వస్తున్న ముగ్గురిని ఆదిభట్ల పోలీసులు అదుపులోకి తీసుకొని వారి నుంచి సుమారు 2.1 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

● ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి రూ30 లక్షలు విలువచేసే 3.8 కిలోల హహీష్ ఆయిల్ (గంజాయి లిక్విడ్)ను వైజాగ్ నుంచి తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తుండగా ఆదిభట్ల పోలీసులు పట్టుకున్నారు.

● రాజస్థాన్‌కు చెందిన ముగ్గురు నాదర్‌గుల్‌లో ఉంటున్నారు. వీరు నిషేధిత పప్పీస్ట్రా (కిలో), పప్పీస్ట్రా పౌడర్ (140గ్రాములు) బేగరికంచలో కార్మికులకు విక్రయిస్తుండగా వారిని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

● నిజామాబాద్‌కు చెందిన ఓ ముఠా ఏపీ నుంచి 62 కిలోల గంజాయిని తుక్కుగూడ ఔటర్ మీదుగా తరలిస్తుండగా మహేశ్వరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలకు నిరసనగా నేడు బైక్ ర్యాలీ



మాట్లాడుతున్న కందె హరిప్రసాద్

ఆమనగల్లు , డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, అసమర్థ విధానాలకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం కల్వకుర్తి నియోజకవర్గంలో బైక్‌ర్యాలీ, సభ నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్ తెలిపారు. ఆమనగల్లులో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు హామీలిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదైనా ఒక్కటీ పూర్తిగా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ అంటేనే వంచన, దగా అన్నారు. ప్రచారార్భాటమే తప్ప ఏడాదిలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. సభలో వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామన్నారు. సమావేశంలో బీజేపీ కల్వకుర్తి నియోజకవర్గ కో-కన్వీనర్ గోరటి నర్సింహ, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు లక్ష్మణ్, చెన్నకేశవులు, విజయ్‌కృష్ణ, వెంకటయ్య, శ్రీను, మహేశ్, లక్ష్మణ్ రావు, శ్రీను పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



యాచారం, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని, గ్రామంలోకి కొత్త వ్యక్తులొస్తే సమాచారమివ్వాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు అన్నారు. నానక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను పిల్లలు నెరవేర్చాలని, బాగా చదివి ఉన్నతిలోకి రావాలన్నారు. ఎస్సై తేజంరెడ్డి, పెద్దయ్య పాల్గొన్నారు.

ఇమ్రాన్‌కు కడారి సత్కారం

కడ్తాల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ నూతన ఉపాధ్యక్షుడు, కడ్తాలకు చెందిన మహ్మద్ ఇమ్రాన్ బాబ, ఏఎంసీ డైరెక్టర్ నరేశ్‌నాయక్‌లను కడ్తాల మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ సత్కరించారు. శనివారం కడ్తాలలో వారిని అభినందించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, రాఖీ, ఉపేందర్, మురళి పాల్గొన్నారు.



సంక్షిప్తంగా

● **శంకర్‌పల్లి:** సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో గిరిరాజ్ కోరారు. శంకర్‌పల్లి మండల పరిషత్‌లో శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 8, 9 తేదీల్లో సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తామన్నారు. విజేతలకు మండల స్థాయిలో 11, 12తేదీల్లో పోటీలను నిర్వహిస్తామన్నారు. మండల స్థాయి విజేతలు జిల్లా స్థాయి పోటీల్లో ఆడతారన్నారు. విద్యార్థులు క్రీడాపోటీలలో పాల్గొనాలని కోరారు. ఎంఈవో అక్బర్, సూపరింటెండెంట్ గోపాలక్రిష్ణ, ఏపీఓ నాగభూషణం ఉన్నారు.

● **కొత్తూర్:** మండలంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. మరమ్మతుల కారణంగా కొత్తూర్ మున్సిపాలిటీ, పెంజర్ల, న్యాట్కో ఫార్మా ప్రాంతంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కరెంటు ఉండదన్నారు.

● **షాద్‌నగర్ అర్బన్:** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు వివరించేందుకు శనివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభకు షాద్‌నగర్ నుంచి బీజేపీ క్యాడర్ తరలివెళ్లింది. సభకు వెళ్తున్న క్యాడర్ వాహనాలకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య జెండా ఊపారు.

● **యాచారం:** గురుకుల హాస్టల్ విద్యార్థుల ఇబ్బందులు తెలుసుకునేందుకు తమకు అనుమతి లేదా? అని మండల బీఆర్ఎస్ నాయకులన్నారు. యాచారంలో కొనసాగుతున్న శంషాబాద్ గురుకుల సందర్శనకు ఎందుకు అనుమతించరని టీచర్లతో వాదనకు దిగారు. ఉపాధ్యాయులు రాజకీయ నాయకుల్లా వ్యవహరించడం సరికాదని, వీరిపై కలెక్టర్ ఇతర అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఖాజుద్దీన్ తదితరులున్నారు.

యాచారం: యువజన కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ సేవాదల్ కార్యకర్తలు గ్రామాలను సందర్శిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. యాచారం కాంగ్రెస్ సేవాదల్ అధ్యక్షుడిగా పూజారి రాకేష్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండేలా పని చేయాలన్నారు. పార్టీకి యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ సేవాదల్, కార్యకర్తల మాటే శిరోధార్యమని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● **యాచారం:** ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ పాలకవర్గంలో స్థానం కల్పించినందుకు మార్కెట్ డైరెక్టర్లు మస్కు నర్సింహ, అక్బర్ ఎమ్మెల్యే రంగారెడ్డిని ఆయన నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. రైతులకు సేవలు చేస్తూ ఇబ్బందులు కలగకుండా సేవలందించాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. ప్రభుత్వ పథకాలపై తెలియజెప్పాలన్నారు. మార్కెట్ యార్డులో కూరగాయల విక్రయ కేంద్రం ఏర్పాటు చేసి రైతుల ఇబ్బందులు తీర్చాలన్నారు. ఏడాదిలోపే పదేళ్ల పాలనలో చేయలేని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బట్టు శ్రీనివాస్, కె.యాదయ్య, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **తలకొండపల్లి:** ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన తలకొండపల్లికి చెందిన అజీం షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌ను కలిశారు. పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. మార్కెట్ డైరెక్టర్‌గా నియమితులైన అజీంను ఎమ్మెల్యే అభినందించారు. రైతు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. ప్రభుత్వం, రైతులకు మధ్య మార్కెట్ కమిటీ పాలకవర్గం వారధిగా పనిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి రవీందర్ యాదవ్, మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఆరీఫ్ తదితరులు ఉన్నారు.

● **తలకొండపల్లి:** మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ 32 పంచాయతీల్లోని 18వేల మంది మహిళలకు బొట్టు పెట్టి, చీరపెట్టి తన కుమారుడి రిసెప్షన్ వేడుకకు ఆహ్వానిస్తున్నారు. తలకొండపల్లికి చెందిన వెంకటేశ్-మంజుల దంపతుల కుమారుడు డాక్టర్ అనిల్‌కుమార్-భావన వివాహం గత నెల 27న హైదరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఆదివారం తలకొండపల్లి క్రాస్‌రోడ్డు వద్ద రిసెప్షన్ నిర్వహించనున్నారు. అన్ని గ్రామాల ప్రజలను వెంకటేశ్ ఆహ్వానించారు.